వరంగల్ రైల్వే స్టేషన్‌లో 39 రైళ్లకు నో స్టాప్

- ఈనెల 25 నుంచి 29 వరకు అమలు
- కాజీపేట జంక్షన్‌లోనే హాల్టింగ్

7



నెత్తుటి చరిత్ర!

మావోయిస్టు ఉద్యమానికి నేటికి 20 ఏళ్లు

- పోరాటంలో కీలక నేతలను కోల్పోయిన దళాలు
- ఉద్యమ యోధులను బలితీసుకున్న కరోనా
- రాష్ట్ర కార్యదర్శి సహా పలువురు కేంద్ర, రాష్ట్ర కమిటీ నేతల మృతి
- ఇటీవలి ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగిన ఓరుగల్లు విప్లవయోధులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన 27మందికిపైగా అజ్ఞాతంలోనే..
- ఆటుపోట్ల మధ్య ఆవిర్భావ వేడుకలకు సిద్ధమైన మావోయిస్టులు

విప్లవాల పురిటి గడ్డ ఓరుగల్లు.. ఎన్నో నక్సల్స్ ఉద్యమాలకు వేదికగా నిలిచిన ప్రాంతం. నాటి పీపుల్స్‌వార్ నుంచి నేటి మావోయిస్టుల వరకు ఎంతోమంది పోరాటానికి మద్దతుగా నిలిచిన నేల. ఆపద వస్తే అడవి నుంచి అన్నలు వస్తారని ఎదురుచూసే అణగారిన ప్రజలున్న పోరుగడ్డ. నక్సల్స్ ఉద్యమానికి ఊపిరినిచ్చిన ఓరుగల్లు గడ్డపైనే తెలంగాణ తొలి ఎన్‌కౌంటర్ జరిగింది. నాటి నుంచి నేటి వరకు ఎంతోమంది యోధులు చిందించిన నెత్తురు ఓ చరిత్రను రాసింది. అయితే ప్రభుత్వంతో చర్చలు విఫలమైన అనంతరం 2004 సెప్టెంబరు 21న అప్పటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్‌తో పాటు మరో రెండు విప్లవ సంఘాలు విలీనమై సీపీఐ (మావోయిస్టు)గా ఆవిర్భవించాయి. నాటి నుంచి నేటి వరకు మావోయిస్టులు పోరుబాటను వదల్లేదు. ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లు. ఓవైపు ప్రభుత్వం నుంచి అణచివేతలు.. మరోవైపు కరోనా లాంటి విపత్కర పరిస్థితులను ఎదురొడ్డారు. తుపాకీతూటాతో రాజ్యాధికారం సాధించాలన్న లక్ష్యంతో పోరుబాట సాగిస్తున్న క్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్‌తోపాటు అనేక మంది మావోయిస్టులు కరోనాకు బలయ్యారు. 20ఏళ్ల మావోయిస్టు ఉద్యమ ప్రస్థానంలో ఎంతో మంది మావోయిస్టు నేతలు, మిలిటెంట్లు, ఇన్‌ఫార్మర్లతో పాటు పోలీసులు సైతం రక్తం చిందించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



7

నేడు కేంద్ర మంత్రి కురియన్ రాక

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులపాటు పర్యటన



హనుమకొండ టౌన్, సెప్టెంబరు 20: కేంద్ర పశుసంవర్థ శాఖ, పాడిపరిశ్రమలు, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండురోజులపాటు పర్యటించనున్నట్లు బీజేపీ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు తెలిపారు. ఈనెల 21న శనివారం ఉదయం 10 గంటలకు జనగామ జిల్లాలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని, అక్కడి నుంచి 12 గంటలకు హనుమకొండ జిల్లాకు చేరుకొని ఫౌల్ట్రీ రైతుల సమావేశంలో పాల్గొంటారు. ఆ తర్వాత హంటర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన బీజేపీ పార్టీ ప్రెస్‌మీట్, సభ్యత్వ నమోదులో పాల్గొని అక్కడి నుంచి వరంగల్‌కు వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి నిట్‌లో బసచేసి ఆదివారం ఉదయం రామప్పను సందర్శించి అక్కడే భూపాలపల్లి, ములుగు జిల్లాల బీజేపీ నాయకులతో సమావేశమై సభ్యత్వ నమోదును పరిశీలిస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం మహబూబాబాద్ జిల్లాకు బయలుదేరి అక్కడ సభ్యత్వ నమోదులో పాల్గొని అనంతరం హైద్రాబాద్ వెళతారని ధర్మారావు పేర్కొన్నారు.



గంజాయి స్మగ్లర్ అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

గంజాయి స్మగ్లర్ అరెస్టు

- రూ.85లక్షల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ

ట్రాక్టర్ కింద గంజాయి ప్యాకెట్లు



వరంగల్ క్రైం, సెప్టెంబరు 20: గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న కిలో లక్ష్మీనారాయణ అనే స్మగ్లర్‌ను హసన్‌పర్తి పోలీసులు, యాంటీ డ్రగ్స్ వరంగల్ విభాగం పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రూ.85లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కిలో లక్ష్మీనారాయణ ఒరిస్సాలో నాటుగురు అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆంధ్రకు చెందిన మరో నిందితుడు కిలో నారాయణరావు సూచన మేరకు గంజాయిని ట్రాక్టర్‌లో ఒరిస్సా నుంచి భద్రాచలం, ములుగు, హనుమకొండ, సిద్ధిపేట మీదుగా కామారెడ్డికి వెళుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. హసన్‌పర్తి ఎస్ఐ దేవేందర్ గురువారం అనంతసాగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ట్రాక్టర్ కనిపించడంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను పరిశీలించగా కింది భాగంలో ప్రత్యేక ఏర్పాటు చేసి 338కిలోల గంజాయిని 96ప్యాకెట్లు చేసి తరలిస్తున్నట్లు గుర్తించి లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకుని విచారించినట్లు వివరించారు. విచారణలో నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇతడికి సహకరించిన ఇద్దరు నిందితులను పట్టుకుంటామని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. గంజాయిని పట్టుకున్న పోలీసులను ఈ సందర్భంగా సీపీ అభినందించారు. ఈ విలేకర్ల సమావేశంలో డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, తిరుమల్, నందిరామ్‌నాయక్, సీఐ చేరాలు, ఎస్ఐ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.6కోట్ల అక్రమాలు?

వర్ధన్నపేట మునిసిపాలిటీలో అవినీతి కంపు కొడుతోంది. రూ.6కోట్ల మేర మునిసిపాలిటీ పనుల్లో అవినీతి జరిగిందని విజిలెన్సు అధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. ఏ సమయంలోనైనా అధికారులు దాడులు చేయడమో, విజిలెన్స్ కార్యాలయానికి హాజరు కావాలని చెప్పడమో జరిగే అవకాశం ఉన్నట్లుగా మునిసిపాలిటీ అధికారవర్గాలు చెపుతున్నాయి. 2020 జనవరిలో మొదటి పాలకవర్గం ఏర్పడగా అప్పటి నుంచి ఏదో ఒక సమస్య తలెత్తుతూనే ఉంది. తాజాగా విజిలెన్స్‌కు ఫిర్యాదు, రూ.లక్షల్లో పాలకవర్గ సభ్యులకు తెలియకుండా డబ్బులు డ్రా చేయడం వర్ధన్నపేటలో దుమారం రేపుతోంది.



- విజిలెన్స్‌కు ఫిర్యాదు?
- వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా వర్ధన్నపేట మునిసిపాలిటీ
- బిల్లుల చెల్లింపుల్లోనూ అక్రమాలు
- రూ.25లక్షలు డ్రా చేశారని కౌన్సిలర్ల ఆరోపణ
- ఉద్యోగ నియామకాల్లో లంచాలు తీసుకున్నట్లు ప్రచారం
- మళ్లీ రెగ్యులరైజేషన్‌కూ రూ.3లక్షల వరకు డిమాండ్



వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 20: గతంలో నూతనంగా ఏర్పడిన పాలకవర్గం ఉన్న సమయంలో అప్పటి కమిషనర్ సైతం ప్రత్యేక పాలనలో పెట్టిన ఖర్చులను డ్రా చేసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఓ విధంగా చెప్పాలంటే కమిషనర్ వ్యవహార శైలిపై అప్పటి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అప్పుడే ఎలాంటి బిల్లులు, తీర్మానాలు లేకుండా రూ.కోట్లలో బిల్లులు తీసుకున్నారని ఆరోపించడంతో ఈ పంచాయితీ అప్పుడు మునుగోడులో ఎమ్మెల్యే సమక్షంలో సద్దుమణిగింది. కౌన్సిలర్లకు ఇచ్చే వర్కుల్లో సైతం తారతమ్యాలు ఉన్నాయని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం నోటీసు అందించడం, చివరకు కొంతమంది పార్టీలు మారడం చర్చనీయాంశంగా మారింది.

విజిలెన్స్‌కు ఫిర్యాదు...

ఇటీవల మునిసిపాలిటీలో జరిగిన అవినీతిని వెలికి తీయాలని ఫిర్యాదు వెళ్లినట్లుగా చర్చించుకుంటున్నారు. దీనిపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించిందని ప్రచారం జరుగుతోంది. దీనిపై మునిసిపాలిటీ అధికారులను ప్రశ్నించగా ఫిర్యాదు అందినట్లు కౌన్సిలర్ల మధ్యచర్చ జరుగుతోంది. కానీ అధికారికంగా ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. రూ.6కోట్ల మేర అవినీతి విషయంలో విచారణ చేయాలని ఫిర్యాదు అందినట్లు తెలుస్తోంది.

రూ.25 లక్షలు డ్రా, తీర్మానం తారుమారు

ఇటీవల కాలంలో మునిసిపాలిటీలో దాదాపు రూ.25 లక్షలు కొందరు కుమ్మక్కై డ్రా చేశారంటూ ఆరోపణలు వినిపించాయి. పలు వార్డుల్లో పనులు చేశామని కౌన్సిలర్లకు తెలియకుండానే రూ.5లక్షల చొప్పున రూ.25 లక్షలు డ్రా చేశారట. విషయం తెలుసుకున్న కౌన్సిలర్లు కమిషనర్‌ను, చైర్మన్‌ను నిలదీశారు. తిరిగి ఈ గొడవను ఎలాగోలా సద్దుమణిగేలా చేశారు. కానీ అప్పటికే ఈ విషయం బయటకు వచ్చేసింది. దీంతో కౌన్సిల్ సమావేశం నడిచినప్పుడు ఎజెండాలు పెట్టుకుని తీర్మానాలు చేసుకుంటారు. వాటిల్లో డబ్బులు డ్రా చేసేందుకు పాలకవర్గం ఒప్పుకున్నట్లు రాసేశారు. దీంతో కౌన్సిలర్లు సైతం చేసేదేమి లేక నిమ్మకుండి పోయారు. ఇలా చేయడం ఇదే తొలిసారేమి కాదట. ఎన్నోసార్లు పాలకవర్గం సంతకాలు చేసిన అంశం ఒకటైతే తర్వాత చూసినప్పుడు మరో అంశాలు ఉన్నాయని చర్చించుకుంటున్నారు. కొంతమంది కౌన్సిలర్లకు చేసిన పనుల బిల్లులు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెండింగ్‌లో ఉండగానే ఒక వ్యక్తికే డబ్బులు ఇవ్వడంపై వాగ్వాదం సైతం చోటు చేసుకుంది.

బిల్లుల చెల్లింపుల్లో కమీషన్..?

మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లు చేసిన పనులకు కావాల్సిన బిల్లులు రిలీజ్ కావాలంటే కమిషనర్‌కు కొంత కమీషన్ ఇవాల్సిందేనని సదరు అధికారి బాహాటంగానే చెపుతున్నాడట? కొంతమంది కౌన్సిలర్లకు రూ.లక్ష లోపు బిల్లులు రావాల్సి ఉండగా ఇటీవల చెల్లింపులు జరిగాయి. చెక్కులపై సంతకాలు చేయాలంటే దాదాపు 10శాతం కమీషన్ కావాలని సదరు అధికారి అడగడం కౌన్సిలర్లను ఆశ్చర్యానికి గురిచేసింది. చూద్దామని చెప్పి సంతకాలు చేసుకుని వెళ్లిన కౌన్సిలర్లను కమిషనర్ నేరుగా ఫోన్ చేసి, వీలుంటే అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయమని అడగడంతో కౌన్సిలర్ అవాక్కయ్యాడట? దీనికి తోడు కొందరు కౌన్సిలర్లు కమిషనర్‌కు చనువుగా ఉండి ఇలా కమీషన్లు ఇచ్చి బిల్లులు తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది. గతంలో కమిషనర్ కొత్తగా వచ్చిన రోజుల్లో తన రెండు నెలల జీతాన్ని పాలకవర్గానికి తెలియకుండానే దాదాపు రూ.5లక్షల వరకు డబ్బులు డ్రా చేసుకున్నాడు. దీంతో కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో వివరణ కోరగా, చైర్మన్‌తో సంతకాలు చేయించుకుని సమస్య పరిష్కరించుకున్నాడన్నది బహిరంగ రహస్యమే.

ఉద్యోగ నియామకాల్లో లంచాలు..

మునిసిపాలిటీలో కమిషనర్‌తో కలిపి 19మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో ఐదుగురు ఉద్యోగులు వివిధ కార్యాలయాల్లో డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇక ఔట్ సోర్సింగ్‌లో 38మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో కొందరు వివిధ కార్యాలయాల నుంచి బదిలీపై రాగా, మరికొందరు వారసత్వంగా ఉద్యోగాలు దక్కించుకున్నారు. ఇంకొందరిని నేరుగా నియమించుకున్నారు. కలెక్టర్ ఆదేశాలతో పాలకవర్గం ఆమోదంతో కొంత మందికి ఉద్యోగాలు ఇచ్చారు. వారిలో దాదాపు ఐదుగురి నుంచి రూ.4 లక్షల నుంచి రూ.5లక్షల వరకు లంచం తీసుకుని పోస్టింగ్ ఇచ్చినట్లు కౌన్సిలర్లే మాట్లాడుకుంటున్నారు. వీరిలో కొంత మందివి కొంత కాలం పాటు మాత్రమే పోస్టులు ఉంటాయి. తిరిగి మళ్లీ తీసుకునేందుకు కలెక్టర్ అనుమతి తీసుకోవాలి. వారి నుంచి ఇటీవల రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు లంచం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని బాధితులు కొంత మంది వద్ద చెప్పుకున్నారట. చాకచక్యంగా కొందరు అప్పుడే రెన్యూవల్ పద్ధతిలో కాకుండా డబ్బులు ఇచ్చి పోస్టులు దక్కించుకోగా, కొందరు మళ్లీ లంచం ఇవ్వాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనిపై కొద్ది రోజులుగా అధికారులు, కౌన్సిలర్ల మధ్య చర్చ జరుగుతోంది.

ఆరోపణలు ఇలా..

మునిసిపాలిటీలో అవినీతి జరిగిందని వాటిపై విజిలెన్స్ విచారణ జరుగుతుందని వస్తున్న అంశంపై ఆరా తీయగా ఆరోపణల అంశాలు ఇలా ఉన్నాయి.

- గత ప్రభుత్వ హయాంలో మునిసిపాలిటీ హరితహారం పేరిట పనులు చేయకున్నా బిల్లులు తీసుకున్నారు.
- రోడ్డు డివైడింగ్ ఖర్చులను భారీ చూపారు.
- వాటి పనుల కోసం ప్రత్యేకంగా ప్రైవేటు వ్యక్తులను పెట్టిన ఖర్చులు చూపడం
- కొన్ని వార్డుల్లో మౌలిక వసతులు, ఆయా పనులు చేయకున్నా చేశారని చూపడం
- మూడు వార్డులకు కలిపి రూ.5లక్షల చొప్పున బిల్లులు చేయడం.
- బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ కొన్ని సార్లు చేసి, ఎన్నో సార్లు చేసినట్లు చూపడం
- మంచి నీటి కోసం విద్యుత్ మోటార్లు కొని, వాటికి కొటేషన్ ఎక్కువ వేయించి బిల్లులు తీసుకోవడం
- వాహనాల కొనుగోళ్లు, వాటి నిర్వహణ, చెత్త సేకరణపై ఖర్చులు ఎక్కువగా రాయడం ఇలా మరెన్నో ఆరోపణలు వర్ధన్నపేట మునిసిపాలిటీపై ఉన్నాయని బహిరంగ చర్చ జరుగుతోంది. మరో నాలుగు నెలల్లో పాలకవర్గం గడువు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో బిల్లులను చెల్లించే విషయంలో కౌన్సిలర్లకు కమిషనర్ సహకరించకపోతే మరిన్ని విషయాలు సైతం వెలుగులోకి వచ్చేలా ఉన్నాయి.

పనుల్లో వేగం పెంచాలి

భద్రకాళి మాఢ వీధుల పనులను పర్యవేక్షించిన కుడా చైర్మన్, కమిషనర్

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 20: భద్రకాళి ఆలయ మాఢ వీధుల పనుల్లో వేగం పెంచాలని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, మునిసిపల్ కమిషనర్ కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడేలు పేర్కొన్నారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో శేషు భారతి, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కుడా ఆధ్వర్యంలో చేపట్టిన అమ్మవారి మాఢవీధుల నిర్మాణ పనులను వారు పరిశీలించారు. పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నవరాత్రుల అనంతరం భద్రకాళి చెరువు ప్రాంతంలో అటు పక్కగా మాఢ వీధుల నిర్మాణపు పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కుడా' అభివృద్ధి పనుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్: కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడేలు పరిశీలించారు. హనుమకొండ, వరంగల్‌లోని సరిగమల పార్కు, పద్మాక్షి టెంపుల్ అప్రోచ్ రోడ్డు, భద్రకాళి సరస్సు, కాకతీయ మ్యూజికల్ గార్డెన్, భద్రకాళి ఆలయ మాఢవీధులు, వేయిస్తంభాల దేవాలయ ఆవరణలో జరుగుతున్న పనులను పరిశీలించారు. 'కుడా' అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కుడా పీవో అజిత్‌రెడ్డితో పాటు సిబ్బంది ఉన్నారు.



భద్రకాళి మాఢ వీధుల పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

డీపీఆర్‌ను సిద్ధం చేయండి

- వరదనీటి పారుదల కోసం మేయర్ సుధారాణి ఆదేశం
- బల్దియాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 20: భూగర్భ డ్రైనేజీ, వరద నీటి పారుదలకు డీపీఆర్‌ను సిద్ధం చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు ఆదేశించారు. బల్దియా కార్యాలయంలో శుక్రవారం నీటి వనరుల నిర్వహణ, ఆక్విఫర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ బ్లూ - గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూపకల్పన కోసం శుభ్ కన్సల్టెన్సీ నిర్వాహకులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతోపాటు జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉన్నత ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. హైదరాబాద్ తర్వాత రెండో అతి పెద్ద నగరమైన వరంగల్ సమగ్ర అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి బహుముఖ రూపాలను అమలు చేస్తున్నారని అన్నారు. సిటీ ఇమేజ్‌ను పెంచేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను నిర్మించేందుకు కన్సల్టెన్సీలను ఆహ్వానిస్తున్నారన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సహాయంతో ముందుకు వెళితే భూసేకరణ సమస్య రాదని అన్నారు. కొద్దిరోజుల్లో ఉన్నతాధికారులతో స్టేక్ హోల్డర్స్‌ను భాగస్వామ్యం చేస్తూ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులు యూజీడీ ఏర్పాటుకు అమూల్యమైన సూచనలు చేయాలన్నారు. ఎన్పీడీసీఎల్, ఆర్‌అండ్‌బీ, టౌన్‌ప్లానింగ్, బల్దియా ఇంజనీరింగ్, కుడా, వరంగల్ ట్రాఫిక్ పోలీసు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇరిగేషన్, ఎన్ఐటీలకు చెందిన అధికారులు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీజీఎం ఆపరేషన్ కిషన్, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, సెక్రెటరీ విజయలక్ష్మి, ఎస్ఈ రాజయ్య, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాసరావు, డీసీపీ ప్రసన్నరాణి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, పీసీబీ ఈఈ సునీత, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌బాబులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

ప్రాణం తీసిన కట్నం వేధింపులు

- 18న గర్భిణి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి



ప్రవళిక (ఫైల్)

దుగ్గొండి, సెప్టెంబరు 20 : భర్త, అత్తలు వరకట్నం కోసం వేధించగా 8 నెలల గర్భిణి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని దేశాయిపల్లి శివారు శంబయ్యపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. శంబయ్యపల్లికి చెందిన కొల్లూరి రమ, చందర్‌రావులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె ప్రవళిక (22) మూడేళ్ల కిందట మండలంలోని వెంకటాపురానికి చెందిన ముదురుకోల సందీప్‌తో ప్రేమ వివాహం చేసుకొంది. ఆ దంపతులకు కుమారుడు పుట్టాడు. వివాహమైన ఏడాది నుంచి భర్త సందీప్, అత్త విజయలు వరకట్నం కింద రూ:10 లక్షలు, రెండు ఎకరాల భూమి కావాలని ప్రవళికను తరచుగా వేధింపులు చేయడం ప్రారంభించారు. వరకట్నం కోసం

మిగతా 8వ పేజీలో

మహబూబాబాద్‌లో నవోదయ, సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 20: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నవోదయ, సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ ఇంటర్నేషనల్ నాయకుడు శనిగారపు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం హనుమకొండలోని ఎంపీ పోరిక బలరాం నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్, సునిల్, వెంకట్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల కోసం జీవితాన్ని ధారబోసిన కొండా లక్ష్మణ్‌బాపూజీ'

రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సరేఖ

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 20: ప్రజల కోసం తన జీవితాన్ని ధారబోసిన త్యాగశీలి కొండా లక్ష్మణ్‌బాపూజీ అని దేవాదాయ, ధర్మాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి సందర్భంగా మంత్రి కొండా సురేఖ నివాళి తెలిపారు. జాతీయ ఉద్యమంలో తొలి, మలిదశ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటాల్లో, సాయుధ రైతాంగ పోరాటంలో సహకార ఉద్యమంలో లక్ష్మణ్‌బాపూజీ పాత్ర అద్వితీయమైనదన్నారు. క్విట్ ఇండియా ఉద్యమకాలంలో బ్రిటీష్ రెసిడెన్సీపై జెండా ఎగురవేశారన్నారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలేయడమేకాక, 96ఏళ్ల వయసులో తెలంగాణ కోసం దీక్ష చేసిన గొప్ప వ్యక్తి లక్ష్మణ్‌బాపూజీ అని కొనియాడారు. విప్లవ పంథాను అనుసరించడంలోనూ పార్లమెంటరీ పంథాలో సాగటంలోనూ ఆయన పాత్ర అమోఘమన్నారు. లక్ష్మణ్‌బాపూజీ ఆధ్వర్యంలోనే దేశంలోనే ప్రప్రథమంగా సహకార సంఘాలు పురుడు పోసుకున్నాయని గుర్తుచేశారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూం టెక్నాలజీకి సీఎం రేవంత్‌రెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టినట్టు పేర్కొన్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌తో భేటీ అయిన సుందర్‌రాజ్ తదితరులు

సుందర్‌రాజ్ యూ టర్న్

- కేటీఆర్ వద్దకు తీసుకెళ్లిన వినయ్‌భాస్కర్
- పార్టీ మారనని మాజీ కుడా చైర్మన్ స్పష్టీకరణ

రాంనగర్, సెప్టెంబరు 20: బీఆర్ఎస్‌ను వీడాలనుకున్న మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యూటర్న్ తీసుకున్నారు. సుందర్‌రాజ్ పార్టీ వీడుతున్నట్లు రెండు రోజులుగా 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురించడంతో బీఆర్ఎస్ నేతలు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే పలువురు నేతలు పార్టీ వీడిన విషయం తెలిసిందే. పశ్చిమలో ఉన్న బలమైన బీసీ నేతను పోగొట్టుకోవడం సరికాదని నిర్ణయించి రెండురోజులుగా సుందర్‌రాజ్‌తో చర్చలు జరిపారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ శుక్రవారం సుందర్‌రాజ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించాడు. భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని, నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, మంచి అవకాశాలు వస్తాయని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు సమాచారం. గతంలో మాదిరిగా పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనాలని కేటీఆర్ సుందర్‌రాజ్‌తో అన్నట్లు తెలిసింది. నేతల మధ్య ఏమైనా అభిప్రాయభేదాలు ఉంటే అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించినట్లు సమాచారం. త్వరలోనే వరంగల్‌కు వస్తానని కేటీఆర్ తెలిపినట్లు సమాచారం. కాగా, కేటీఆర్‌తో భేటీ అయిన సుందర్‌రాజ్.. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని పేర్కొన్నట్లు తెలిసింది. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఇవ్వాలని సుందర్‌రాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సూచించినట్లు సమాచారం.

ఫిట్స్‌తో ఇంటర్ విద్యార్థి మృతి

మడికొండ, సెప్టెంబరు 20: ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇంటర్మీడియేట్ విద్యార్థి మృతి చెందాడు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ చిగురుమామిడి మండలం నవాబుపేటకు చెందిన బుర్ర మల్లేశం కుమారుడు బుర్ర రామ్‌చరణ్ (18) కాజీపేట మండలం భట్టుపల్లిలోని ఓ ప్రయివేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం కళాశాల ఉపాధ్యాయుడు ముద్దం సంతోష్ ఫోన్ చేసి తమ కుమారుడికి ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడని, ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి రావాలని తెలిపాడు. ఆస్పత్రికి చేరుకున్న తమకు అప్పటికే తమ కుమారుడు మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి మల్లేశం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

నెత్తుటి చరిత్ర!

- మావోయిస్టు ఉద్యమానికి నేటికి 20ఏళ్లు
- పోరాటంలో కీలక నేతలను కోల్పోయిన దళాలు
- వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన 27మందికిపైగా అజ్ఞాతంలోనే
- ఆటుపోట్ల మధ్య ఆవిర్భావ వేడుకలకు సిద్ధమైన మావోయిస్టులు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

సీపీఐ(మావోయిస్టు) ఉద్యమానికి నేటితో ఇరువై ఏళ్లు నిండాయి. 2004లో పీపుల్స్‌వార్ అగ్రనేతలు నాటి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చల పేరిట మైదాన ప్రాంతాల్లోకి వచ్చారు. ఈ క్రమంలోనే పీపుల్స్‌వార్ రహస్య ప్రాంతాలపై గురి పెట్టిన పోలీసులు నక్సల్స్‌పై వల విసరటంతో తీవ్రంగా దెబ్బతిన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ నక్సల్స్ గ్రూపుతో దేశంలో బలమైన నక్సల్స్ ఉద్యమాన్ని నడుపుతున్న మరో రెండు విప్లవ సంఘాలైన మావోయిస్టు, కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీ), సీపీఐ (ఎంఎల్) నక్సల్బరీ గ్రూపులతో కలిసి విలీనమై అదే ఏడాది సెప్టెంబరు 21న సీపీఐ (మావోయిస్టు)గా ఏర్పడ్డాయి. ఇలా శనివారం నాటికి మావోయిస్టు పార్టీ ఆవిర్భవించి 20ఏళ్లు. అయితే నాటి చర్చల అనంతరం మావోయిస్టు ఉద్యమంపై అప్పటి ప్రభుత్వం ఉక్కుపాదం మోపటంతో మావోయిస్టు దండకారణ్య ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్‌లోకి మకాం మార్చారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని అడవులను కేంద్రంగా చేసుకుని నక్సల్స్ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ వస్తున్నారు. అయితే తెలంగాణలో ముఖ్యంగా ఉత్తర ప్రాంతంలో పూర్వవైభవం కోసం మావోయిస్టులు రెండు దశాబ్దాలుగా చేస్తున్న ప్రయత్నాలు పూర్తిగా సఫలం కాలేకపోతున్నాయి. ఈ 20ఏళ్ల కాలంలో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలకు సరిహద్దులో ఉన్న భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో తమ ప్రాబల్యం పెంచుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తూ భారీ మూల్యాన్ని చెల్లించుకుంటోంది.

ఓరుగల్లులోనే తొలి ఎన్‌కౌంటర్..

2004లో మావోయిస్టు పార్టీగా ఆవిర్భవించిన తరువాత పదేళ్లు ఉమ్మడి రాష్ట్రంలో, మరో పదేళ్లు తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టులు ఉద్యమాలు చేస్తున్నారు. అయితే తెలంగాణ ఏర్పడితే తమ ఉద్యమానికి మరింత మద్దతు దొరుకుతుందని భావించిన మావోయిస్టులకు తొలి ఏడాదే భారీ షాక్ తగిలింది. అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం మవోయిస్టులకు తూటాతో సమాధానం చెప్పింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం రంగాపూర్ అడవుల్లో 2015 సెప్టెంబరు 15న జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ నగరంలోని వడ్డెపల్లికి చెందిన బీటెక్ విద్యార్థిని శృతి అలియాస్ మహిత(23), ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన విద్యాసాగర్‌రెడ్డి అలియాస్ సాగర్ మృతి చెందారు. తెలంగాణ ఏర్పడిన తరువాత జరిగిన తొలి మావోయిస్టు ఎన్‌కౌంటర్ ఓరుగల్లులోనే జరగటం అప్పట్లో విప్లవకారులు, తెలంగాణ వాదుల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక 1991కాలంలో మావోయిస్టులు అనేక మంది కీలక నేతలను కోల్పోయారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ఎస్‌యూ నేత పులి అంజయ్య అలియాస్ సాగర్ రాష్ట్రకార్యదర్శిగా ఎదిగి 1991ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆ తరువాత వరుసగా కేంద్ర కమిటీసభ్యులు నల్లా ఆదిరెడ్డి, శీలం నరేష్, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డిలు భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం కొయ్యూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆ తరువాత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎదిగిన క్రాంతిరణదేవ్ అలియాస్ బక్కన్న, గుండెబోయిన అంజయ్య అలియాస్ బాలన్న, శెట్టిరాజ పాపయ్య అలియాస్ సోమన్న, గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్, తిప్పారపు రాములు అలియాస్ తాతా, బగే నాగేశ్వర్‌రావు అలియాస్ ప్రభాకర్ లాంటి కీలక నేతలు వేర్వేరు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందటంతో పార్టీ పెను సంక్షోభంలోకి వెళ్లింది.

కరోనాతో మావోయిస్టులు విలవిల

మావోయిస్టు పార్టీ గత 20 ఏళ్లలో ఎన్నడూ ఎదుర్కోని విపత్తును ఎదుర్కొంది. ఎన్నో ఎన్‌కౌంటర్లు, దాడులు, బాంబు బ్లాస్టింగులను ఎదుర్కొని ధైర్యంగా నిలిచి పోరాడిన మావోయిస్టు అగ్రనేతలు కరోనా నుంచి తప్పించుకోలేక పోయారు. దీంతో 2020-21 మధ్యకాలంలో పలువురు మావోయిస్టు కీలక నేతలు కరోనాతో మృతి చెందటం ఉద్యమానికి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా ఉన్న ఓరుగల్లుకు చెందిన అనేక మంది మావోయిస్టు అగ్రనేతలు మృత్యువాత పడ్డారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మాడగూడెంకు చెందిన మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషన్ 2021 జూన్ 21న కరోనాతోనే మృతి చెందారు. అలాగే కేంద్ర కమిటీ సభ్యులు కత్తి మోహన్‌రావు అలియాస్ ప్రకాష్ 2021 జూన్ 10వ తేదీన కరోనా బారిన పడి గుండెపోటుకు గురై మృతి చెందారు. అలాగే ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన మాడ్ ఏరియా కార్యదర్శి సిద్ధబోయిన సారక్క అలియాస్ భారతక్క 2021 జూన్ 22న కరోనాతోనే కన్నుమూసింది. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన మ్యాదరి భిక్షపతి 2021 జనవరి 18వ తేదీన అనారోగ్యానికి గురై మృతి చెందారు. వీరితో పాటు సుమారు 10మందికి పైగా మావోయిస్టు నేతలు కరోనా బారిన పడి మృతి చెందినట్లుగా సమాచారం. అలాగే మావోయిస్టు పార్టీ అగ్రనేతలు బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌తో పాటు అనేక మంది మావోయిస్టులు కరోనా బారిన పడ్డట్లు ప్రచారం జరిగింది. ఇలా ఎన్నిక సంక్షోభాలు ఎదురైనా ఎప్పటికప్పుడు కొత్త నాయకత్వాన్ని సృష్టిస్తూ ఆ లోటును భర్తీ చేసింది. కానీ ప్రస్తుతం ఆ కాలం నాటి రిక్రూట్‌మెంట్‌లు లేవు. దీంతో కరోనాతో కీలక నేతలను కోల్పోయినా మావోయిస్టులు వారి స్థానాలను భర్తీ చేయలేకపోతోంది. రాష్ట్ర కార్యదర్శి యాప నారాయణ మృతి తరువాత రెండున్నరేళ్ల వరకు నూతన కార్యదర్శిని నియమించలేకపోయింది. ఈ పరిణామాలు చూస్తుంటే కరోనా మహ్మారి మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపిందనేది స్పష్టమవుతోంది.

మరో 27మందికిపైగా అజ్ఞాతంలో..

20ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో 1991-94కాలం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొన్న మావోయిస్టులు 30ఏళ్ల తరువాత 2021-24లో అంతకంటే పెను సంక్షోభంలో కూరుకపోయారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రస్తుతం పోరుబాటలో ఓరుగల్లు నేతలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో దామోదర్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది. ఇక కేంద్ర కమిటీ సభ్యుడిగా భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన గాజర్ల రవి అలియాస్ గణేష్ మావోయిస్టుల్లో కీలక నేతగా ఉన్నారు. ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో గణేష్ మావోయిస్టుల చర్చల ప్రతినిధిగా వెళ్లారు. అలాగే ములుగు జిల్లా గోవిందారావుపేట మండలం మొద్దులగూడేనికి చెందిన కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ ఏవోబీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ముప్పిడి బాబునావు, అంకీశ్వరం సారయ్యలతో పాటు పలువురు నేతలు కేంద్ర కమిటీలో కీలక బాధ్యతల్లో ఉన్నారు. వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలో 18మందికి పైగా అజ్ఞాతంలో ఉండగా, భూపాలపల్లి జిల్లా నుంచి నలుగురు, ములుగు జిల్లా నుంచి ఐదుగురు మావోయిస్టులు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 27మందికి పైగా నక్సల్స్ మావోయిస్టు ఉద్యమంలో అజ్ఞాతంలో ఉన్నట్టుగా సమాచారం.

ఒక్కొరొక్కరుగా నేలకొరుగుతూ..

మావోయిస్టు ఉద్యమంలో ఓరుగల్లు నేతలే కీలకంగా ఉండటంతో.. ఎక్కడ ఏ అడవుల్లో తుపాకీ పేలినా ఇక్కడి పల్లెల్లో అలజడి మొదలయ్యేది. ఆ ఎన్‌కౌంటర్‌లో తమ వారున్నారా అని చెమ్మగిల్లిన కళ్లతో కుటుంబీకులు ఎదురుచూసేవారు. 2010లో అప్పటి ప్రభుత్వం మావోయిస్టు నేతలను గుర్తించింది. అందులో కరీంనగర్ నుంచి 60మంది అజ్ఞాతంలో ఉండగా, ఉమ్మడి వరంగల్ నుంచి అత్యధికంగా 80మంది అజ్ఞాతంలో అదీ కీలక పదవుల్లో ఉన్నట్లు గుర్తించారు. ఈ 14ఏళ్ల కాలంలో 60శాతం మంది మావోయిస్టులు లొంగిపోవటమో, ఎన్‌కౌంటర్‌లో మృతి చెందటమో, అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల కాలంలో ములుగు జిల్లా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అనేక మంది మావోయిస్టులు మృతి చెందారు.

- ఈ ఏడాది ఏప్రిల్ 16న ఛత్తీస్‌గఢ్ కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా చల్లెగరిగే గ్రామానికి చెందిన సిరిపల్లి సుధాకర్ అలియాస్ మురళి అలియాస్ శంకర్‌రావు మృతి చెందారు. ఆయనతో పాటు ఆయన భార్య ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌కు చెందిన దాసెశ్వర్ సుమన అలియాస్ రంజిత కూడా మృతి చెందింది.
- ఏప్రిల్ 30వ తేదీన ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కేశినేని రవి అలియాస్ వినయ్ మృతి చెందాడు.
- జూలై 25వ తేదీన ములుగు- భద్రాద్రికొత్తగూడెం జిల్లా గుండాల, తాడ్వాయి మండలాల సరిహద్దుల్లోని దామెరతోగు, కరకగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భూపాలపల్లి జిల్లా గణపురం మండలానికి చెందిన పీఎల్‌జీఏ సభ్యుడు అశోక్ అలియాస్ విజేందర్ మృతి చెందాడు.
- ఈనెల 5వ తేదీన ఛత్తీస్‌గఢ్ దంతేవాడ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ మృతి చెందాడు.

చెస్‌పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరణ


చెస్ పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు20: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న హనుమకొండ టీడీడీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు జిల్లాస్థాయి చెస్ పోటీలను వాల్ పోస్టర్‌ను శుక్రవారం హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి క్రీడాపోటీల నిర్వాకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. చెస్‌తో మేధోసంపత్తి చేకూరుతుందని, జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థులు రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో అండర్-15 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న చెస్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 4గురు బాలురు, 4బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్స్ ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి మార్కెట్లో తడిసిన మొక్కజొన్నలు

ఓపెన్ యార్డులో వరదనీటిలో కొట్టుకుపోయిన మక్కలు

కేసముద్రంలో 600 బస్తాలకుపైగా తడిచిన సరుకు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబర్ 20: ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో మార్కెట్లో తడిచిపోవడంతో రైతులు తల్లడిల్లిపోయారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 72మంది రైతులు 2,724 బస్తాల్లో 1,634 క్వింటాళ్ల మొక్కజొన్నలను విక్రయించేందుకు తీసుకువచ్చారు. కొంతమంది రైతుల సరుకుల్లో తేమశాతం ఎక్కువగా ఉండడంతో ఓపెన్ యార్డులో ఆరబెట్టుకున్నారు. వీరిలో కొంతమంది ఈ-నామ్ లాట్ తీసుకున్నవారు సైతం ఉన్నారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా కొద్ది నిమిషాలపాటు వర్షం కురవడంతో ఓపెన్ యార్డులో ఉన్న రైతులు తమ సరుకును కాపాడుకోలేకపోయారు. వర్షంలోనే తడుస్తూ మొక్కజొన్నలను దగ్గరకు కుప్పగా చేర్చారు. మహబూబాబాద్ మండలం వేమునూరు ఇందిరానగర్‌కు చెందిన భూక్య హుస్సేన్ ఎకరంన్నరలో పండించిన మొక్కజొన్నలు తడిచిపోయాయి. గూడూరు మండలం పొనుగోడు రాములుతండాకు చెందిన భూక్య స్వామి, బానోత్ భద్రు, సాము, ఇనుగుర్తికి చెందిన బానోత్ వెంకన్నతో పాటు మరి కొంతమంది రైతుల సరుకులు పూర్తిగా తడిచి నష్టపోయారు. కొంతమంది టార్పాలిన్లు అందుబాటులో లేక నీటి వరదలో మొక్కజొన్నలు కొట్టుకుపోతున్నప్పటికీ చూస్తూ అలాగే ఉండాల్సిన దైన్యస్థితి నెలకొంది. దాదాపు 20 మంది రైతులకు చెందిన సుమారు 600 బస్తాల మొక్కజొన్నలు తడిచిపోయాయి.


కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో నీళ్లలో తడిచిన మొక్కజొన్నలను తీస్తున్న రైతు భూక్య హుస్సేన్

డిగ్రీ కళాశాల అడ్మిషన్ల మార్పులకు మరో అవకాశం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన డిగ్రీ విద్యార్థులు తాము అడ్మిషన్లు పొందిన కళాశాలలోనే కోర్సులను మార్చుకునేందుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి, దోస్త్, కళాశాల విద్యాశాఖాధికారులు మరో అవకాశం కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ఏ డిగ్రీ కళాశాలలో నైనా డిగ్రీ కోర్సుల అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు తమకు ఇష్టమైన కోర్సులకు మార్చుకుని చదువుకునేందుకు అవకాశం కల్పించినట్లు కమిషనర్ శ్రీదేవసేనా, చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రిలు నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. సెప్టెం బరు 21 నుంచి 23 వరకు కళాశాలల కోర్సులు మార్పులు చేసుకోవచ్చునని వివరించారు. 24న తుది జాబితాను విడుదల చేస్తామని అధికారులు స్పష్టంచేశారు. వర్సిటీలోని అన్ని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు గమనించి తమ అర్హతల మేరకు తమకు ఇష్టమైన కోర్సులను అభ్యసించే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

23న కేయూలో సెనెట్‌హాల్‌లో సింపోజియం

హాజరుకానున్న హరగోపాల్, కోదండరామ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం నేతృత్వంలో సెప్టెంబరు 23న ఉదయం 10గంటలకు డెకోడల్ డెవలప్‌మెంట్ ఆఫ్ తెలంగాణ స్టేట్-ఇష్యూష్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై సింపోజిం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కేయూ ఆర్థశాస్త్ర విభాగాధిపతి, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ అధ్యక్షత వహిస్తారు. సింపోజింలో ముఖ్యఅతిథిగా ప్రముఖ సామాజిక వేత్త, సెంట్రల్ వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ జి.హరగోపాల్, స్పెషల్ గెస్టుగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.కోదండరామ్, కీలక ఉపన్యాసకులుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్థికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డి.నర్సింహరెడ్డి, కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిలు పాల్గొననున్నారు.

డిగ్రీ ఇయర్ వైజ్ స్టూడెంట్స్‌కు పరీక్షలు నిర్వహించాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 20: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఇయర్‌వైజ్‌లో డిగ్రీ, పీజీ కోర్సులు చదివిన పాత విద్యార్థులందరికీ పరీక్షలు నిర్వహించాలని కేయూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు పి.ఉపేం దర్‌రెడ్డి జనరల్ సెక్రటరీ ఎం.ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కేయూ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారిలను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలను అందచేశారు. వర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు ఇతర కోర్సులు చదివిన విద్యార్థులు ఒక్కటి , రెండు సబ్జెక్టులు తప్పిపోయి డిగ్రీ ఉత్తీర్ణత సాధించలేకపోయారని వారికీ మళ్లీ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. అఖరు చాన్స్‌గానైనా డిగ్రీ పాత విద్యార్థులకు వర్సిటీ ఉన్నతాధికారులు ఆలోచించి పరీక్షలను నిర్వహించాలని కోరారు. అలాగే యూడీఎఫ్ ఫీజులను తగ్గించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఎంజీఎంలో అత్యాధునిక పరికరాల ఏర్పాటు

ఎంజీఎం అధికారులతో సమీక్షా సమావేశంలో వరంగల్ కలెక్టర్ సత్య శారద


సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలు అందించేందుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ముందుకొచ్చినట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంజీఎం సూపరింటెండెంట్ మురళి, ఆర్ఎంవో మురళి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం సమయ్యలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ పనుల కింద వైద్య పరికరాల సరఫరా చేయడానికి పవర్ గ్రిడ్ ముందుకు రావడంపై కలెక్టర్ వారిని అభినందించారు. ఎంజీఎం ఆస్పత్రిలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన పరికరాల వివరాల నివేదికలు సమర్పించాలని ఎంజీఎం సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, తహసీల్దార్ ఇక్బాల్, పవర్‌గ్రిడ్ జూనియర్ ఇంజనీర్ సీహెచ్.సంపత్ పాల్గొన్నారు.

ఓపీ ల్యాబ్‌లో రోగుల కష్టాలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ విభాగంలో రోగుల కోసం ప్రత్యేకమైన ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లోకి వెళ్లాలంటే రోగులు నరకయాతన అనుభవించాల్సిందే. రోగ నిర్ధారణకు అవసరమయ్యే సీబీపీ, ఎలక్ట్రోలైట్స్ షుగర్ పరీక్షల లాంటివి ఈ ల్యాబ్‌లో చేస్తారు. ప్రస్తుత సీజన్‌లో అధిక సంఖ్యలో రోగులు వస్తుండటంతో ఆ గదిలోకి పైకి ఎక్కాలంటే చుక్కలు కనబడుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగులు జారీ కింద పడుతున్నారని వాపోతున్నారు. గతంలో మందులు ఇచ్చే దగ్గరనే ఈ 47వ నెంబరు ల్యాబ్ ఉండేది. ఓపీ పక్కనే ఈ ల్యాబ్ ఉండటంతో చాలా సౌకర్యంగా ఉండేది. అధికారులకు ఏమైందో ఏమో కాని లేకుంటే తీసుకొచ్చి దూరాన ఏర్పాటు చేశారు. అది కూడా పైకి ఎక్కడానికి వీలు లేకుండా ఉందని రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎంజీఎం అధికారులు రోగులకు అనువైన చోటికి ఓపీ సేవలను దగ్గర ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎంజీఎంలో ఫిర్యాదుల పెట్టెలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: ఎంజీఎం ఆస్పత్రి పాలనను గాడిలో పెట్టేందుకు ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. రోగులు తమకు కలుగుతున్న ఇబ్బందులను ఫిర్యాదుల రూపంలో రాసి ఈ బాక్సుల్లో వేయాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ వీటిని స్వయంగా తెరిచి సమస్యలు తెలుసుకున్నారు. ఎంజీఎంలో పదికిపైగా ఇలాంటి పెట్టెలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఇప్పటివరకు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇంకా మెరుగైన ఫలితాల కోసం ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఓపీ కౌంటర్ల సంఖ్యనుకూడా పెంచాలని అధికారులను ఆదేశించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాలిక మృతదేహం తరలించడంలో వైఫల్యం

'ఎక్స్'లో సర్కారుపై కేటీఆర్ వ్యాఖ్యలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మృతి చెందిన గిరిజన బాలిక గీతిక (6)ను తరలించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. తన ఎక్స్ ఖాతాలో ఈ విషయంపై స్పందించారు. ప్రభుత్వ అంబులెన్స్ ఉండి కూడా గిరిజన బాలిక మృతదేహాన్ని స్వస్థలానికి తరలించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటన ప్రభుత్వానికి అవమానకరం అని అన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యానికి ఇంది పరాకాష్టగా మిగులుందన్నారు.

వరంగల్ రైల్వే స్టేషన్‌లో 39 రైళ్లకు నోస్టాప్

- ఈనెల 25 నుంచి 29 వరకు అమలు
- కాజీపేట జంక్షన్‌లోనే హాల్టింగ్



గిర్మాజీపేట, సెప్టెంబరు 20: వరంగల్ - కాజీపేట ఎఫ్ క్యాబిన్ - హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌ల మధ్య జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా విజయవాడ - కాజీపేట - బల్లార్ష సెక్షన్‌లో ఈనెల 25 నుంచి 29 వరకు గరీబ్‌రథ్, వందేభారత్, గోదావరి, పద్మావతి, సింహపురి, తదితర 39 రైళ్లకు వరంగల్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ తాత్కాలికంగా ఎత్తివేసినట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈనాలుగు రోజుల పాటు గరీబ్‌రథ్, వందేభారత్, కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వరంగల్‌కు బదులుగా కాజీపేటలో ఆగుతాయని, ఇతర రైళ్లు కూడా యథావిధిగా కాజీపేటలో ఆగుతాయని వెల్లడించారు.

కాజిపేటలో ఆగే రైళ్లు ఇవే..

ప్రస్తుతం వరంగల్‌లో మాత్రమే స్టాప్ కలిగి కాజీపేటలో స్టాప్‌లేని విశాఖపట్టణం - సికింద్రాబాద్ - విశాఖపట్టణం గరీబ్‌రథ్ రైళ్లు ఈనెల 25 నుంచి 29 వరకు, షాలిమార్ - సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ 25న, కాకినాడటౌన్ - లింగంపల్లి - కాకినాడటౌన్ కాకినాడ ఎక్స్‌ప్రెస్ రైళ్లు 26, 27 తేదీల్లో, టాటా - యశ్వంత్‌పూర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ 26న వరంగల్‌కు బదులుగా కాజీపేట రైల్వేస్టేషన్‌లో తాత్కాలికంగా ఆగుతాయని తెలిపారు.

యథావిధిగా కాజీపేటలో హాల్టింగ్

గూడూరు - సికింద్రాబాద్ - గూడూరు సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, విశాఖపట్టణం - సికింద్రాబాద్ - విశాఖపట్టణం గోదావరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, కాకినాడ పోర్ట్ - లింగంపల్లి - కాకినాడ పోర్ట్ గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మణుగూరు - సికింద్రాబాద్ - మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మచిలీపట్టణం - బీదర్ - మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తాంబరం - హైద్రాబాద్ - తాంబరం చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తిరుపతి - కరీంనగర్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, తిరుపతి - సికింద్రాబాద్ - తిరుపతి పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, నర్సాపూర్ - నాగర్‌సోల్ - నర్సాపూర్ నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నాలుగు రోజులు వరంగల్‌లో ఆగకుండా యథావిధిగా కాజీపేట రైల్వేస్టేషన్‌లో ఆగుతాయని తెలిపారు. అలాగే విశాఖపట్టణం - మహబూబ్‌నగర్ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శాలిమార్ - హైద్రాబాద్ - శాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్టణం - సాయినగర్‌షిర్డి - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ రైళ్లు, యథావిధిగా కాజీపేటలో ఆగుతాయని శ్రీధర్ తెలిపారు. సాయినగర్ షిర్డి - కాకినాడ పోర్ట్ - సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, శాలిమార్ - సికింద్రాబాద్ - శాలిమార్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కాజీపేటలో ఆగుతాయని వెల్లడించారు. అలాగే యశ్వంతాపూర్ - నిజాముద్దీన్ - యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈనెల 22నుంచి అక్టోబరు 7వరకు ప్రస్తుత కాచిగూడ - కాజీపేట - బల్లార్ష - నాగపూర్‌కు బదులుగా కాచిగూడ - నిజామాబాద్ - ముద్కెడ్ - పింపల్ కుటి నాగపూర్ మీదుగా ప్రయాణిస్తుందని పేర్కొన్నారు.

వరంగల్‌లో పనిచేయలేం.. ఖమ్మం పంపించండి..

మంత్రికి రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల మొర

రాంనగర్, సెప్టెంబరు 20: వరంగల్ జిల్లాలో పనిచేయలేమని, తిరిగి ఖమ్మం జిల్లాకు పంపించాలని రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎదుట మొరపెట్టుకున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఖమ్మం జిల్లాకు చెందిన రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులను వరంగల్‌కు, ఇక్కడి వారిని ఖమ్మం పంపించారు. ఖమ్మం నుంచి బదిలీపై వచ్చిన అటెండర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ స్థాయి ఉద్యోగులు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఆగస్టు మొదటివారంలో వరంగల్‌కు వచ్చిన ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ రిజిస్ట్రేషన్ చేస్తే ఏమవుతుందోననే భయంతో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. నిబంధనల సాకుతో రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదు. ఆస్తుల క్రయవిక్రయాల్లో సబ్‌రిజిస్ట్రార్‌లు ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు సమాచారం. కాగా, కొద్దిరోజుల్లోనే వరంగల్‌లో పనిచేయలేమని గుర్తించిన ఉద్యోగులు.. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసినట్లు సమాచారం. ఏ మాత్రం అవకాశం ఉన్నా తిరిగి ఖమ్మం పంపించాలని కోరినట్లు తెలిసింది.

ముగిసిన రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీలు

కాజీపేట, సెప్టెంబరు 20: కాజీపేటలో రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి రైల్వే ట్రాక్‌ల తనిఖీలు శుక్రవారంతో ముగిశాయి. రెండురోజులుగా ప్రత్యేక ట్రాలీలో కాజీపేట నుంచి వరంగల్ మీదుగా తిరిగి హసన్‌పర్తి వరకు నిర్మించిన మూడో రైల్వేట్రాక్‌ను పరిశీలించారు. కాజీపేట - హసన్‌పర్తి కోమటిపల్లి వద్ద నిర్మించిన సొరంగమార్గం సైతం పరిశీలించారు. ఈ సొరంగమార్గం వద్ద సేఫ్టీ కమిషనర్ కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలుస్తోంది. సొరంగమార్గంతోపాటు మూడోలైన్ నిర్మాణం అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆదేశాలను జారీ చేసినట్లు రైల్వే ఉద్యోగులు తెలిపారు. సేఫ్టీ కమిషనర్ సొరంగమార్గం మూడోలైన్‌ల నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేసినట్టు రైల్వే ఉద్యోగులు తెలిపారు. ఫిట్‌నెస్ సర్టిఫై చేసిన అనంతరం ఈట్రాక్‌లపై ట్రయల్ రన్ చేయనున్నారని రైల్వే అధికారులు తెలిపారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి


అల్లం ప్రవీణ్ (ఫైల్)

గార్ల (మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 20 : పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందగా, తల్లికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పాత పోచారంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని పాత పోచారం గ్రామానికి చెందిన అల్లం ప్రవీణ్ (22), తల్లి కోటేశ్వరితో కలిసి తమ భూమిలోని మిర్చి తోటలో పనులు చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా గాలిదుమారం, వానతో పాటు ఉరుములు, మెరుపులతో వారు పనులు చేస్తున్న ప్రదేశంలో పిడుగుపడడంతో ప్రవీణ్ స్పృహతప్పి పడిపోయాడు. పక్కనే ఉన్న తల్లి కోటేశ్వరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పక్కపొలం రైతులు ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం ఆటోలో ఖమ్మంకు తరలిస్తుండగా మృతి చెందాడు.



మంత్రి సురేఖను ఆహ్వానించిన టీఎఫ్‌సీసీ

వరంగల్ సిటీ, సెప్టెంబరు 20: తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, సినీ నిర్మాత సామల గణేష్ శుక్రవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్ జూబ్లీహిల్స్ తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా అక్టోబరు మొదటి వారంలో టీఎఫ్‌సీసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని మంత్రిని ఆహ్వానించారు.



మంత్రి సురేఖను ఆహ్వానిస్తున్న రామకృష్ణ, సామల గణేష్

ప్రశ్నించడం ప్రతీ పౌరుడి హక్కు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 20: ప్రజలకు జవాబుదారీగా అధికారులు పనిచేయాలని, ప్రతీ సామాన్యుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా ఏర్పడిందే సమాచార హక్కు చట్టమని ఆర్టీఐ పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడానికి పౌర సంబంధాల అధికారులు నిర్లక్ష్యానికి శిక్షలు, జరిమానాలను విధించేలా జరిగిందన్నారు. మా సంస్థ ద్వారా ప్రజలకు వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పద్మశాలీ ఉద్యోగుల వెబ్ పోర్టల్ షురూ

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 20: పద్మశాలీ ఉద్యోగుల సంఘం వెబ్ పోర్టల్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయం హైద్రాబాద్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఇప్పటికే పద్మశాలీల ఉద్యోగుల సంఘం, మ్యారేజ్ బ్యూరో కార్యాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉద్యోగులకు ఇంకా సులభంగా ఉండేందుకు సంఘం అభివృద్ధి కోసం ఈ వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేశామన్నారు. పోర్టల్ ద్వారా పద్మశాలీల అభ్యున్నతి కోసం వధూవరుల వివాహ పరిచయ వేదికను, పద్మశాలీ ఉద్యోగ సభ్యత్వ నమోదు, విద్యార్థులకు అవార్డులు, ప్రశంసాపత్రాలకు సంబంధించిన అన్నింటిని పోర్టల్‌లో ఆధునీకరించడం జరిగిందన్నారు.

21 మందికి జరిమానా

మట్టెవాడ, సెప్టెంబరు 20: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 21 మంది వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వీరాస్వామి 30,100 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఏడుగురికి రూ.8వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు. అలాగే, వాహనాలు నడుపుతూ పట్టుబడిన 13 మంది బాలురను వరంగల్ ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. వారిని జువైనల్ కోర్టులో ఛార్జిషీట్ ఫైల్ చేశారు. వీరిని జువైనల్ హోంకు తరలించాలని మేజిస్ట్రేట్ ఆదేశించారు. వారిని ఒకరోజు అబ్జర్వేషన్ హోంకు తరలించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు.



వరంగల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయం



ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న మోటార్ వెహికిల్ అధికారి

ఆర్టీఏపై అలసత్వం

- వెంటాడుతున్న సిబ్బంది కొరత
- పనుల్లో తీవ్ర జాప్యం
- అసహనం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

ఖిలావరంగల్, సెప్టెంబరు 20: వరంగల్ జిల్లా రవాణాశాఖ కార్యాలయాన్ని సిబ్బంది కొరత వెంటాడుతోంది. దాంతో వాహన రిజిస్ట్రేషన్‌లు, డ్రైవింగ్ లైసెన్సులు, పేరు మార్పిడి, రెన్యూవల్స్ తదితర పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లాకు చెందిన వాహనదారులు వరంగల్ నాయుడు పెట్రోల్ పంపు వద్ద గల ఆర్టీఏ కార్యాలయానికి వస్తుంటారు. నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, ట్రాక్టర్‌లు, లారీలు వంటివి రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సులు, రెన్యూవల్స్, పేరు మార్పిడి తదితర పనుల కోసం ఎంతో మంది వస్తుంటారు. నిత్యం 100 నుంచి 150 వరకు రెండు, మూడు, నుంచి 20 టైర్ల భారీ వాహనాలు వస్తుంటాయి. కానీ, అధికారులు, సిబ్బంది కొరత కారణంగా కార్యాలయానికి రెండు, మూడుసార్లు తిరగాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. వాహనాల రిజిస్ట్రేషన్‌లు, డ్రైవింగ్ లైసెన్సులు, పేర్ల మార్పిడి, రెన్యూ వల్స్ తదితర పనులపై మొదటగా ఈ-సేవా, మీసేవా కార్యాలయానికి వాహనదారులు వస్తుంటారు. వారికి సరైన సమాచారం లేకపోవడంతో వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సులు పొందడంలో అనేక వ్యయప్రయాసాలకు గురవుతున్నారు.

డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్‌లు పొందే విషయంలో కార్యాలయంలో (హెల్ప్‌డెస్క్) సలహాదారులు లేకపోవడంతో వాహనదారులు తికమకపడుతున్నారు. అలాగే కార్యాలయంలో టెంపరరీ, కింది స్థాయి సిబ్బందితో పాటు మధ్య వర్తులదే ఇష్టారాజ్యం నడుస్తోంది. ఆన్‌లైన్ ద్వారా లైసెన్సు కోసం వచ్చిన వారికంటే బ్రోకర్ ద్వారా వచ్చిన వారికి త్వరగా పనులు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

సిబ్బంది కొరత

సరిపడా అధికారులు, సిబ్బంది లేకపోవడంతో పనుల్లో జాప్యం జరు గుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. జిల్లా అధికారి, ఇద్దరు మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు, ఒక అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్, ఒక సీనియర్ అధికారి, ఇద్దరు కానిస్టేబుల్స్, ఐదుగురు హోం గార్డులు కలిపి 12మంది మాత్రమే ఉన్నారు. ఇటీవల ఓ జూనియర్ అసిస్టెంట్ గుండెపోటుతో మృతి చెందాడు. ప్రస్తుతం ఎంవీఐగా విధులు నిర్వర్తిస్తున్న జయపాల్‌రెడ్డి ప్రస్తుతం అతడికి మహబూబ్‌నగర్ ఆర్టీఏగా అదనపు బాధ్యలు అప్పగించారు. రెండు నెలలుగా ఆర్టీవో అధికారి అనారోగ్యం కారణంగా లీవ్‌లో ఉన్నారు. కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, అటెండర్, స్వీపర్, వాచ్‌మెన్ తదితర సిబ్బంది లేరు.

అక్రిడిటేషన్ ప్రక్రియ ప్రారంభించండి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 20: రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెం బర్ జక్కుల విజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బల్దియా కార్యాలయం ఆవరణలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులు ఈ యేడు జూన్ 30 వరకు ముగిసినా అధికారులు సెప్టెంబరు 30 వరకు పొడిగిం చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా పాత కార్డులను రెన్యువల్ చేయకుండా కొత్త కార్డులకు రూపకల్పన చేయాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించి అక్రిడిటేషన్లపై స్పష్టమైన ఆదేశా లివ్వా లని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పోడేటి అశోక్, ఉపాధ్యక్షుడు ఈర్ల సురేందర్, కోశాధికారి గాయపు రాజిరెడ్డి, మచ్చిక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తికి అరుదైన గౌరవం

- మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు
- ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం
- హర్షం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు

పాలకుర్తి, సెప్టెంబరు 20 : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నడుం బిగించి విస్నూరు దేశ్‌ముఖ్‌పై తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరును రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. శుక్రవారం కేబినేట్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టేందుకు ఆమోదం తెలిపారు. నిరంకుశ విధానాలు, రాజరిక ఫ్యూడల్ వ్యవస్థలకు వ్యతిరేకంగా తెలంగాణలో ఎన్నో ప్రజా ఉద్యమాలు వచ్చాయి. దీనిలో భాగంగా చాకలి ఐలమ్మ, కొమరంభీం, రాంజీ గోండు తదతర పోరాట యోధులు ఎందరో నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా స్వయం పాలన, ప్రజాస్వామ్య పరిరక్షణకై తమ తమ పంథాలో పోరాటాన్ని చేశారు. హైదరాబాద్‌లోని మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టడంతో యావత్ తెలంగాణ ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం పోరాట చరిత్రను భావి తరాలకు అందించేందుకు మహిళా యూనివర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టడం పాలకుర్తి ప్రాంత ప్రజలకు గొప్ప వరమని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తాడిచెట్టు పై పడిన పిడుగు

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 20: ఆరెపల్లిలోని ఓ తాటి చెట్టుపై పిడుగు పడింది. శుక్రవారం రాత్రి కురిసిన వర్షాలతో భారీ ఉరుములు, మెరు పులు రావడంతో తాటిచెట్టు పై పిడుగు పడి దగ్ధ మైంది. దీంతో విలీన గ్రామంలోని ప్రజలు ఒక్క సారిగా ఉలిక్కి పడ్డారు. పిడుగు పడిన తాటిచెట్టు పూర్తిగా దగ్ధం కావడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



పిడుగుపాటుతో దగ్ధమమవుతున్న తాడిచెట్టు

తెలంగాణ

ఉద్యమకారుడి మృతి

కాశిబుగ్గ, సెప్టెంబరు 20: తెలంగాణ ఉద్యమకారుడు బింగి సారంగపాణి (70) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందాడు. ఎల్‌బీనగర్‌కు చెందిన సారంగ పాణి 1982లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పొందారు. రాష్ట్ర సాధన కోసం టీఆర్ఎస్‌లో చేరి ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించారు. 2001లో అర్బన్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ కార్యదర్శిగా, 2003లో ప్రధాన కార్యదర్శితో పాటు పలు పదవులు నిర్వహించారు. సారంగపాణికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమా ర్, బీజేపీ నేతలు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, వెంకటేశ్వర్లు, తెలంగాణ ఉద్యమ కారులు అచ్చ విద్యాసాగర్, రవి, శ్రీనివాస్, అశోక్, ప్రభాకర్, పెరుమాళ్ల లక్ష్మణ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



సారంగపాణి (ఫైల్)

కిశోర బాలికలు పోషకాహారాన్ని తీసుకోవాలి

ఖిలా వరంగల్, సెప్టెంబరు 20: కిశోర బాలికలు రక్తహీనతకు గురికాకుండా నిత్యం పోషకాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు ఆశాదేవి, రమ దేవిలు సూచించారు. శుక్రవారం శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిషోర బాలికలకు పోషణ అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోషణ మాసోత్సవంలో భాగంగా కేంద్రం నెల రోజుల పాటు అన్ని వర్గాల ప్రజలకు పోషకాలపై అవగాహన కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గండె శ్రవన్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు రాజసులోచన, వనజ, రమాదేవి, భాగ్యమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● శంభునిపేట : కౌమార దశలో వచ్చే మార్పులకు అనుగుణంగా బాలికలకు పోషకారం అందించాలని 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మస్వామి సూచించారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో కిశోర బాలికల పోషకాహారం అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ ఖిలావరంగల్ సర్కిల్ సూపర్ వైజర్ తీగల కల్యాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ పోశాల పద్మ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వద్దిరాజు భవాని, స్వర్ణలత, గాయత్రి, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పోశాల పద్మ

ప్రాణం తీసిన కట్నం వేధింపులు

(5వ పేజీ తరువాయి)

పలు మార్లు పుట్టింటికి పంపారు. ప్రవళిక, సందీప్ దంపతుల పంచాయితీని పెద్ద మనుష్యులు పలుసార్లు చేసి, నచ్చ చెప్పి ప్రవళికను అత్తగారి ఇంటికి పంపారు. అయినప్పటికీ భర్త, అత్తలలో ఏలాంటి మార్పురాలేదు. నెల రోజుల కిందట మళ్లీ భర్త సందీప్, అత్త విజయ వరకట్నం కోసం వేధించి ప్రవళికను పుట్టింటికి పంపారు. అప్పటికే ప్రవళిక 8 నెలల గర్భవతి. వరకట్నం ఇస్తేనే తీసుకుపోతామని భర్త, అత్త తెలపడంతో ప్రవళిక మానసికంగా బాధపడుతూ ఈ నెల 18న ఇంటిలో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగింది. పురుగుల మందు తాగిన ప్రవళికను బంధువులు వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకోసం చేర్పించారు. ప్రవళిక గర్భిణి కావడంతో ముందుగా కడుపులో ఉన్న పాపను బయటకు తీస్తే తల్లి బతుకుతుందని డాక్టర్లు అపరేషన్ చేసి పాపను బయటకు తీశారు. పాపను చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పాప చికిత్స పొందుతూ 19న మృతి చెందింది. ప్రవళిక చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందింది. ప్రవళిక తండ్రి చందర్‌రావు 10ఏళ్ల కిందట మృతి చెందాడు. ప్రవళిక తల్లి కొల్లూరి రమ ఫిర్యాదు మేరకు తాహసీల్దార్ రవిచంద్రారెడ్డి సమక్షంలో పంచనామా చేసి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రవళికకు మూడేళ్ల కుమారుడు ఉన్నాడు.



శివనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

'స్వచ్ఛతా హీ సేవ'పై అవగాహన ర్యాలీ

ఖిలావరంగల్, సెప్టెంబరు 20: తడి, పొడి చెత్తను వేరు చేసి మునిసిపాలిటీ ఆటో వారికి ఇవ్వాలని కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి అన్నారు. శుక్రవారం శివనగర్‌లో బల్దియా, వావ్ శ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివనగర్‌లో తడి, పొడి చెత్తపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వావ్ ఫీల్డ్ కో-ఆర్డినేటర్ పవన్ తడి, పొడి, హానికరమైన చెత్త గురించి ఏకశిల డీజీ స్కూల్ విద్యార్థులకు వివరించి వాటిని వేరు చేయడం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వాడడం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈమేరకు శివనగర్ నుంచి డివిజన్, ప్రధాన కూడలిలో ర్యాలీని చేపట్టి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లవకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లింగాల కుమారస్వామి, జవాన్లు కుమార్, సురేందర్ పాల్గొన్నారు.



రామన్నపేటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సఖీ సెంటర్ నిర్వాహకులు

మహిళలకు 24 గంటలు 'సఖీ' సేవలు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 20: మహిళల హక్కులు చట్టాలపై అవగాహన కల్పించడానికి సఖీ సెంటర్ ద్వారా 24 గంటల పాటు సేవలందుబాటులో ఉంటాయని సఖీ సెంటర్ వర్కర్ తిరుమల స్వప్న అన్నారు. శుక్రవారం సఖీ సెంటర్ సేవలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని రామన్నపేట, ఖిలావరంగల్‌లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ప్రాంతాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులతో సఖీ సేవల పోస్టర్‌ను రామన్నపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ మహిళలు, చిన్నారులకు అందించే సేవలను వివరిస్తూ బాలికల రక్షణ భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖీ సెంటర్లను నడిపిస్తున్నాయని తద్వారా బాధిత మహిళలకు కౌన్సిలింగ్, పోలీసు సహాయం, న్యాయ, వైద్య సహాయం తాత్కాలిక వసతి సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలకు మహిళా హెల్ప్‌లైన్ 181 కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వప్న, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వాన్ని ఇస్తున్న పార్టీ నాయకులు

బీజేపీ సభ్యత్వ నమోదు

కాశిబుగ్గ, సెప్టెంబరు 20: గడప గడపకు భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం కాశిబుగ్గలో నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ ప్రదీప్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఉపాధ్యక్షుడు రంజిత్, సముద్రాల పరమేశ్వర్, ఎరుకల రఘునారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణకిశోర్, కార్యదర్శి వెంకటేష్, 19వ డివిజన్ అధ్యక్షుడు సతీష్, ఆనంద్, శ్రీనివాస్, మురళీకృష్ణ, అజయ్, రాజనీష్, సత్తన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 20: సబ్‌స్టేషన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం శంభునిపేట, దేశాయిపేట, ఉర్సు, పోతన, ఏజే మిల్స్, స్టేషన్‌రోడ్డు, ఫోర్టు వరంగల్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, కేయంసీ, పోచమ్మమైదాన్ సబ్‌స్టేషన్ పరిధిలో 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని వరంగల్ డీఈ మల్లిఖార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు.

హుండీ ఆదాయం రూ.3.05లక్షలు

మట్టెవాడ, సెప్టెంబరు 20: వరంగల్ శ్రీబాలనగర వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టారు. రూ.3,05,057 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎలపాటి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. లెక్కింపులో ఆలయ ఈవో ఎలపాటి రత్నాకర్‌రెడ్డి, జి.సంజీవరెడ్డి, ఆలయ ఛైర్మన్ పారశరం శ్రీనివాసచార్యులు, మాజీ ధర్మకర్త గండె గోవింద రాజులు, చిన్నాల వెంకటరమణ, ఓలం గోవర్దన్, శ్రీలక్ష్మి వేంకటేశ్వర సేవ సమితి, శ్రీబాలనగర వేంకటేశ్వర సేవా సమితి మహిళ మండలి సభ్యులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఉద్యోగులు



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శనివారం 21 సెప్టెంబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

30న పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ

నర్సంపేట, సెప్టెంబరు 20 : హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాకూర్ ఆడిటోరియంలో ఈ నెల 30న జరిగే పీడీఎస్ 50 సంవత్సరాల స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అలువాల నరేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలో సంఘం కార్యాలయంలో శుక్రవారం స్వర్ణోవ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామన్ విద్యా విధానాన్ని అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. సంఘం ఆవిర్భవించి 50 ఏళ్ళు అవుతుందని అప్పటినుంచే విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు, విద్యార్థుల హక్కుల కోసం, శా స్త్రీయ విద్యావిధానం అమలు చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ పోరాటాలను కొనసాగిస్తుందని అన్నారు ఈ నెల 30న హైదరాబాద్‌లో జరిగే స్వర్ణోత్సవాల సభను అక్టోబరు 1న జరిగే పీడీఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయం వంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అశోక్, నరేశ్, వెంకటేశ్, వీరేందర్, రమేశ్, రాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము పరిశీలన



గోదాములోని స్టాక్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 20 : పట్టణంలోని సివిల్ సప్లయి ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంను జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వానికి సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యంను ఇవ్వడంలో జాప్యం చేస్తున్న నర్సం పేట మునిసిపాలిటీ పరిధిలోని బాలాజీ రైస్ మిల్లు, మాధన్నపేటలోని వెంకటేశ్వర రైస్ మిల్లులను అడిషనల్ కలెక్టర్ సందర్శించారు. ఈ నెల 30 వరకు సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాలని మిల్లర్లను ఆదేశించారు. అనంతరం మండలం లోని మాధన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో వండుతున్న బియ్యాన్ని పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ వెంట సివిల్ సప్లయ్ డీఎం బి.సంధ్యారాణి, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

నర్సంపేట, సెప్టెంబరు 20 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ సోల్తి సారయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించి ఆర్డీవో కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కులగణనను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి పేద విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలాల నరేందర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సాంబరాతి మల్లేశం, బీసీ ఐక్యవేదిక నాయకులు పంజాల వెంకట్, బొనసాగి రవీందర్, సురేశ్, ఉప్పుల రాకేశ్, శ్రీధర్, శ్రీనివాస్, యాకయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా పంట కాల్వలు

చెరువు నిండా నీరున్నా.. పారని కాల్వలు
ఎండుతున్న వరి పంట.. ఆందోళనలో రైతులు..
పట్టించుకోని అధికారులు, పాలకులు

చెన్నారావుపేట, సెప్టెంబరు 20 : మండలంలోనే అతి పెద్ద చెరువైన కోపాకుల చెరువుకు ఉన్న ప్రధాన కాల్వలు అధ్వానంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో చెరువు కింద సుమారు 650 ఎకరాలకు సాగు నీరందించటంతో పంటలు పండుతాయి. చెరువు పూర్తి స్థాయి మట్టం 11 ఫీట్లు కాగా ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తి స్థాయిలో నిండి మత్తడిపోస్తుంది. గతంలో వర్షాలు కురిసినా వరద రాక మత్తడి పోసేది కాదు. ఇటీవల కాలంలో మత్తడి పోసిన చెరువులో సమృద్ధిగా సాగు నీరున్నప్పటికీ ప్రధాన కాలువలు సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు సాగు నీరు అందించడానికి వచ్చే ప్రధాన కాలువలో చెత్త, పిచ్చి మొక్కలు, తాటి కమ్మ ఆకులు, గుర్రపు డెక్క ఆకులతో నిండి ఉంది. కాలువకు ఎలాంటి మరమ్మతు పనులను చేపట్టకపోవడంతో సాగు నీరు దాటే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. అంతే కాకుండా ప్రధాన కాలువకు పలు చోట్ల గండ్లు పడడంతో సాగు నీరు రావటం లేదని, కింది ఆయకట్టుకు సాగు నీరు రావటం లేదని రైతులు తెలిపారు.

నీళ్లు కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తున్న..

తాళ్లపెల్లి చంద్రమౌళి, రైతు, చెన్నారావుపేట



కోపాకుల చెరువు కింద ఆయకట్టుకు సాగు నీరు రాకపోవడంతో వ్యవసాయ బావి నీళ్లు కొనుగోలు చేసి పంటలను పండిస్తున్నా. ప్రధాన కాలువకు మరమ్మతు పనులను వేసవి కాలంలోనే చేపట్టి ఉంటే బాగుండేది. ప్రస్తుతం చెరువులో నీళ్లు ఉన్నా కింది ఆయకట్టుకు చుక్క నీరురాని పరిస్థితి ఉంది. కాలువకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. ఉపాధిహామీ కూలీలతో పనులు చేయిస్తే కాలువ ఎంతో బాగుండేది. ప్రస్తుతం సాగు నీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు నాట్లు వేసిన రైతులు నానాపాట్లు పడుతున్నారు.

అస్తవ్యస్తంగా మారిన ఎత్తిపోతల పథకం నిర్వహణ

మండల కేంద్రంలో పాకాల వాగుపై నిర్మించిన ఇందిరా ప్రియదర్శిని ఎత్తిపోతల పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారినా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోపాకులు చెరువుకు చివరి ఆయకట్టులో ఉన్న సుమారు 70 ఎకరాలకు సాగు నీరందించేందుకు రూ.2.20 కోట్లతో ఎత్తి పోతల పథకం నిర్మాణం చేపట్టారు. వర్షాకాలం ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఈ సీజన్‌లో ఇంకా నిర్వహణ ప్రక్రియను మొదలు పెట్టక పోవడంతో రైతులు పోసిన నారు మడులు ముదిరి పోతున్నాయి. చివరి ఆయకట్టు రైతులకు అటు చెరువు నీరందక, ఇటు ఎత్తిపోతల పథకం నీరందక ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఎత్తి పోతల పథకం కోసమై ఏర్పాటు చేసిన కమిటీ, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పూర్తిస్థాయిలో సాగు నీరందించడానికి చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారిన కోపాకుల చెరువు కాలువ

చివరి ఆయకట్టుకూ సాగు నీరందించాలి..

లక్కడీ కోమల్‌రెడ్డి, రైతు, చెన్నారావుపేట



కాలువల్లో చెత్త చెదారంతో పాటు గుర్రం డెక్క ఆకు, పిచ్చి మొక్కలతో అధ్వానంగా మారడంతో చివరి ఆయకట్టుకు సాగునీరందడంలేదు. చెరువు నిండా సాగునీరు సమృద్ధిగా ఉన్నా సంబంధిత రెవెన్యూ, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వేసిన పంటలు ఎండి పోతున్నాయి. ఎత్తిపోతల పథకాన్ని పట్టించుకొనే వారు లేరు. మోటార్లకు మరమ్మతులు చేపట్టాలి.

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



ఇల్లందలో మానవహారం చేపట్టిన జీపీ సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయపర్తి, సెప్టెంబరు 20 : విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని రాయపర్తి ఎంపీడీవో కిషన్ నాయక్ సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవ హారం, ప్రతిజ్ఞ చేయించి క్విజ్ పోటీలు ఏర్పాటుచేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీవో కూచన ప్రకాష్, కార్యదర్శి వినోద్ కుమార్, ప్రిన్సిపాల్ సరిత, వైస్ ప్రిన్సిపాల్ లీలా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఇల్లందలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జీపీ కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో గ్రామ అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులతో మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు.

● చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ , ఉప్పరపల్లి, తిమ్మారాయిన్‌పహాడ్ గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను మండల సమాఖ్య వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీవాణి మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఎం ఈశ్వరయ్య, ఏపీవో అరుణ, కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.

● పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా తహసీల్దార్ వెంకటస్వామి గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో శ్రీనివాసులు, ఏపీఎం కృష్ణమూర్తి, గ్రామ వైద్యురాలు నవ్యకృష్ణ, కార్యదర్శి సరిత, గ్రామస్థులు మల్లయ్య, గురువారావు, రథన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని జ్యోతిరావు పూలే విద్యాలయంలో మండల అధికారులు స్వచ్ఛత ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. గ్రామంలో ప్లాస్టిక్ వస్తువులు వేయడానికి సెంటర్లను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నూనె వేణుప్రసాద్, టీఏ సమ్మయ్యలు పాల్గొన్నారు.

● గీసుగొండ : స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఊకల్ గ్రామాన్ని డీఆర్‌డీవో కౌసల్యాదేవితో కలిసి జెడ్పీ సీఈవో రాంరెడ్డి సందర్శించారు. గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కన్సల్టెంట్ శ్రీనివాసరావు, అడిషనల్ పీడీ మంజులాదేవి, ఇంచార్జీ ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, మెడికల్ ఆఫీసర్ మమత, ఏపీఎం సురేష్, ఏపీవో చంద్రకాంత్, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

● సంగెం : పరిశుభ్రతపై శ్రద్ధతీసుకోవాలని మేరా యువ భారత్ ప్రతినిధులు వెల్దెండ సురేష్, గాలి భిక్షపతిలు చెప్పారు. గుంటూరుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్వచ్ఛతా హీ సేవాలో చెత్తను తొలగించి, మొక్కలను నాటారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నల్లబెల్లి:మండలంలోని రుద్రగూడెం, మామిండ్ల వీరయ్యపల్లి గ్రామాల్లో డీఎల్‌పీవో రాజీవ్‌కుమార్ హాజరై పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి పసరుగొండ రవి, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

పర్వతగిరి, సెప్టెంబరు 20 : ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన అక్కల నితిన్, అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన ముంజంపల్లి కార్తీక్ అనే ఇద్దరు వ్యక్తులు మండలంలోని మూడుచక్రాం తండా వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని చూసి పారిపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న కాలేజీ బ్యాగుల్లో తనిఖీ చేయగా 900 గ్రాముల గంజాయి లభించినట్లు సమాచారం. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



అనిల్ (ఫైల్)

చెన్నారావుపేట, సెప్టెంబరు 20 : మండలంలోని పాపయ్యపేటలోని బీసీ కాలనీకి చెందిన చిరుత అనిల్ (31) ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది, గ్రామస్థులు. పోలీసుల కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన అనిల్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. అనిల్‌కు శుక్రవారం ఉదయం తీవ్రంగా కడుపు నొప్పి వచ్చింది. కడుపు నొప్పిని భరించలేక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వదిన సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కల నుంచి రక్షణ కల్పించాలి

నల్లబెల్లి, సెప్టెంబరు 20 : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని పలు సంఘాల నాయకులు అడ్డ రాజు, బట్టు సాంబయ్య తెలిపారు. శుక్రవారం నల్లబెల్లి మండల ఎంపీడీవో నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు.

నేడు వినియోగదారుల సదస్సు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 20 : నేడు వర్ధన్నపేట, రాయపర్తి మండలాల విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు రాయపర్తిలో నిర్వహిస్తున్నట్లు వర్ధన్నపేట ఏడీఈ కన్న రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాయపర్తి, మైలారం, వర్ధన్నపేట సెక్షన్ల పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దరఖాస్తు రూపంలో తీసుకుంటామని స్పష్టం చేశారు.

సంగెంలో ఫ్లెక్సీల నిషేధం

సంగెం, సెప్టెంబరు 20 : మండల కేంద్రంలో ఎలాంటి రాజకీయ ఫ్లెక్సీల ఏర్పాటును నిషేధించాలని గ్రామ సభలో తీర్మానించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఇటీవల మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ విషయంపై చర్చకు వచ్చింది. ప్రభుత్వ భూముల్లో, రోడ్డు కిరువైపులా ప్రజలకు ఇబ్బందులు కలిగేలా రాజకీయ ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి ఇచ్చేదిలేదని గ్రామ ప్రత్యేకాధికారి, మండల తహసీల్దార్ రాజకుమార్ చెప్పారు. ఎవరైనా ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి

ఖానాపురం, సెప్టెంబరు 20 : మండలంలోని బుధరావుపేటకు చెందిన అనపర్తి సంజీవ ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో వ్యవసాయ బావి వద్ద విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులకు విద్యుత్ శాఖ నుంచి పరిహారం మంజూరైంది. రూ.5 లక్షల చెక్కును శుక్రవారం నర్సంపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆస్పత్రిలో ఎమ్మెల్యే పరామర్శ



నిమ్స్‌లో నరేందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి, సెప్టెంబరు 20: మండలంలోని కొండాపురం గ్రామ పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రబెల్లి నరేందర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

సంగెం, సెప్టెంబరు 20 : మండల కేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మండలంలోని పలు గ్రామాలకు చెందిన గౌడ కులస్తులు సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గౌడ కులస్థుల ఆరాధ్య దైవంగా భావిస్తున్న సర్వాయి పాపన్న ఓరుగల్లుకు వన్నె తెచ్చారని, పోరాట యోధునిగా గుర్తింపు పొందిన మండల కేంద్రంలో ఆయన విగ్రహ ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు జనగాం రమేష్‌గౌడ్, గుళ్లపల్లి ఉమేందర్‌గౌడ్, కక్కెర్ల శరత్‌బాబుగౌడ్, కోడూరి వెంకట్‌గౌడ్, దొమ్మటి జగన్నాథంగౌడ్, భాస్కర్‌గౌడ్, దొమ్మటి మల్లేశంగౌడ్, ఆగపాటి రాజశేఖర్‌గౌడ్, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

రాజన్నసిరిసిల్లకు తరలిన క్రీడాకారులు

సంగెం, సెప్టెంబరు 20 : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరగబోయే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్ విభాగంలో జరిగే క్రీడలకు మండలంలోని మొండ్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.ప్రణయ్‌వర్ధన్, పి.భరత్, ఎ.అస్మిత, ఎ.సౌజన్య శుక్రవారం తరలివెళ్లినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ చెప్పారు. ఎంపికైన విద్యార్థులను అమ్మ ఆదర్శ కమిటీ చైర్ పర్సన్ అనుముల శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

● దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జనగాం కావ్యశ్రీ, అనుముల కీర్తన సాఫ్ట్‌బాల్ క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం భద్రమ్మ, పీఈడీ లింగమూర్తి శుక్ర వారం వెల్లడించారు. నేటీ నుంచి సిరిసిల్లలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.


విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలి

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 20 : పట్టణంలోని కోనాపురం 7వ వార్డులో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని శుక్రవారం వార్డు ప్రజలు వర్ధన్నపేట విద్యుత్ ఏఈ తరుణ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం మండల అధ్యక్షుడు ఆకుల మనోజ్, యువకులు సతీష్, అజయ్, అశోక్, నరేందర్, ప్రదీప్, యాకయ్య పాల్గొన్నారు.

అమరుల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలి

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 20 : భూమి కోసం, భుక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరులైన వీరుల విగ్రహాలను హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు పంజాల రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఇల్లందలో తెలంగాణ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాల సందర్భంగా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వరంగల్ సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి భాషమియా, మండల కార్యదర్శి రవి పాల్గొన్నారు.

హైవే రోడ్డుపై డస్టు తొలగింపు



డస్టును తొలగిస్తున్న జీపీ సిబ్బంది

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 20 : హైవే పై దుమ్ము తిప్పలనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి శుక్రవారం గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మేరకు గ్రామ కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై పడిన దుమ్మును ఊడ్చి, వాటర్ ట్యాంకర్ ద్వారా నీటితో కడిగి శుభ్రంచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వెళ్తున్న లారీల్లో నుంచి దుమ్ము కింద పడడంతో సమస్య ఎదురవుతోందని, దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించామని తెలిపారు.

సహకార సంఘం అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

చెన్నారావుపేట, సెప్టెంబరు 20 : సహకార సంఘం అభివృద్ధిలో రైతులందరూ భాగస్వాములు కావాలని సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యానారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం 67వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘంలోని రైతులకు వచ్చిన రుణమాఫీ డబ్బులను అందిస్తున్నామన్నారు. ప్రతీ రైతుకు రుణాలు అందిస్తామన్నారు. రైతులు ఆరబోత కోసం ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో సొసైటీ ఆవరణలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. అనంతరం సభలో సభ్యుడు, మాజీ వైస్ చైర్మన్ తోగరు చెన్నారెడ్డి మాట్లాడుతూ జల్లి గ్రామంలో రైతులకు గోదాం నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని అధికారులు కేటాయించాలని, లేని పక్షంలో తన సొంత స్థలంలో 6గుంటలను గోదాం నిర్మాణం కోసం భూమిని విరాళంగా అందిస్తామని ప్రకటించారు. అలాగే పలువురు సభ్యులు సమావేశానికి పూర్తిస్థాయిలో రైతులు హాజరుకాకపోవడం పట్ల అభ్యంతరం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చింతకింది వంశీ, సీఈవో చిట్టె రవి, డైరెక్టర్‌లు రాజు, రమాదేవి, కోమల, మజ్జిక రాంబాబు. సరిత, బషీర్, ఫూల్ శంకర్, మంజుల, కవిత, గోపి, అధికారులు. కీరు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ మార్ట్‌గేజ్ రిలీజ్ కోసం రైతుల తంటాలు

గీసుగొండ, సెప్టెంబరు 20 : ఊకల్ రైతు సేవా సహకారం సంఘంలో రుణాలకోసం ల్యాండ్ మార్టిగేజ్ చేసిన రైతులు మార్టిగేజ్ రిలీజ్ కోసం నానా తంటాలు పడుతున్నారు. మార్ట్‌గేజ్ రిలీజ్ చేస్తేనే మళ్లీ రుణాలు పొందే అవకాశం ఉండటంతో మీ సేవ ద్వారా చాలాన్ కట్టి తహసీల్దార్ కార్యాలయానికి వెళితే మేము ఇవ్వలేము అంటు రెవెన్యూఅధికారులు చెపుతున్నారని రైతులు వాపోతున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయంలోనే ల్యాండ్ మార్ట్‌గేజ్ రిలీజ్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. మార్ట్‌గేజ్ రిలీజ్ కోసం రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే ఎక్కువ ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. తహసీల్దార్‌లకు సబ్ రిజిస్ట్రార్ హోదా ప్రభుత్వం కల్పించినప్పటికీ వారు ఎందుకు మార్టిగేజ్‌ను రిలీజ్ చేయటం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ అడుగగా తమకు ఎటువంటి ఆదేశాలు లేవని చెప్పారు. తాము ఒకవేళ చేసిన లాండ్ మార్ట్‌గేజ్ రిలీజ్ అనేది ధరణి పోర్టల్‌లో మాత్రమే కనిపిస్తుందని ఈసీలో కనబడదని చెప్పారు. కాగా, తహసీల్దార్ కార్యాలయంలో రూ. 2వేల వరకు అయ్యే పనికి రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రూ.7వేల వరకు ఖర్చు అవుతుందని వాపోతున్నారు.

గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

ఖానాపురం, సెప్టెంబరు 20 : గ్రామ పంచాయతీలలో తీవ్ర నిధుల కొరత ఉన్నందున జీపీ రోజువారి కార్యకలాపాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కోరుతూ శుక్రవారం ఎంపీడీవో భారతికి పంచాయతీ కార్యదర్శులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షురాలు రజిత, కార్యదర్శి రాంబాబు, సుప్రజ, యుగేందర్, మాలత, కల్పన, శ్యామల పాల్గొన్నారు.

● రాయపర్తి : గ్రామ పంచాయతీల్లో తీవ్ర నిధుల కొరత ఉన్నందున రోజువారి కార్యకలాపాలకు కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని మండల టీపీఎస్‌సీఎఫ్ అధ్యక్షుడు నర్సయ్య కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కిషన్, ఎంపీవో కూచన ప్రకాష్‌లకు వినతి పత్రం అందించారు.

● వర్ధన్నపేట రూరల్ : గ్రామ పంచాయతీల నిర్వహణ భారం మోయలేమంటూ శుక్రవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల టీఎన్జీవో అనుబంధ సంఘం ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శులు రామారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన కట్నం వేధింపులు

(5వ పేజీ తరువాయి)

పలు మార్లు పుట్టింటికి పంపారు. ప్రవళిక, సందీప్ దంపతుల పంచాయితీని పెద్ద మనుష్యులు పలుసార్లు చేసి, నచ్చ చెప్పి ప్రవళికను అత్తగారి ఇంటికి పంపారు. అయినప్పటికీ భర్త, అత్తలో ఏలాంటి మార్పురాలేదు. నెల రోజుల కిందట మళ్లీ భర్త సందీప్, అత్త విజయ వరకట్నం కోసం వేధించి ప్రవళికను పుట్టింటికి పంపారు. అప్పటికే ప్రవళిక 8 నెలల గర్భవతి. వరకట్నం ఇస్తేనే తీసుకుపోతామని భర్త, అత్త తెలపడంతో ప్రవళిక మానసికంగా బాధపడుతూ ఈనెల 18న ఇంటి లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగింది. బంధువులు వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రవళిక గర్భిణి కావడంతో ముందుగా కడుపులో ఉన్న పాపను బయటకు తీస్తే తల్లి బతుకుతుందని డాక్టర్లు ఆపరేషన్ చేసి పాపను బయటకు తీశారు. పాపను చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పాప చికిత్స పొందుతూ 19న మృతి చెందింది. ప్రవళిక చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ప్రవళిక తండ్రి చందర్‌రావు 10ఏళ్ల కిందట మృతి చెందాడు. ప్రవళిక తల్లి కొల్లూరి రమ ఫిర్యాదు మేరకు తాహసీల్దార్ రవిచంద్రారెడ్డి సమక్షంలో పంచనామా చేసి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రవళికకు మూడేళ్ల కుమారుడు ఉన్నాడు.